నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 నల్లగొండ, గురువారం 27 మార్చి 2025 NALGONDA

## జవహర్ నవోదయ ఫలితాలు విడుదల

పెద్దవూర, మార్చి 26 : మండలంలోని చలకుర్తి నవోదయ విద్యాలయంలో 6వ, 9వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం బుధవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో తాత్కాలికంగా ఎంపికైన 80 మంది విద్యార్థులతోపాటు 9వ తరగతిలో ఎంపికైన 11 మంది విద్యార్థుల వివరాలను ఆయన వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు సంబంధిత వెబ్ సైట్ నుంచి అడ్మిషన్ ఫారాలు డౌన్‌లోడ్ చేసుకొని, వివరాలు పూర్తిగా నింపి, అవసరమైన అన్ని సర్టిఫికెట్లు ఏర్పాటు చేసుకొని డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

## సూర్యాపేట డీఎస్పీ రవిపై బదిలీ వేటు

- కాంగ్రెస్ నేత హత్య కేసు విషయంలో నిర్లక్ష్యమే కారణం

సూర్యాపేట టౌన్, మార్చి 26 : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో ఇటీవల జరిగిన కాంగ్రెస్ సీనియర్ నేత మెంచు చక్రయ్యగౌడ్ హత్య కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించినందున డీఎస్పీ రవిపై బదిలీ వేటు పడింది. డీజీపీ కార్యాలయానికి ఆయన్ని అటాచ్ చేస్తూ అడిషనల్ డీజీపీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట ఇన్‌చార్జి డీఎస్పీగా కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డిని నియమించా రు. ఇదే కేసులో తుంగతుర్తి సీఐ శ్రీనును మంగళవారం రాత్రి ఏజీ మల్టీజోన్-2కు అటాచ్ చేశారు.



నేరేడుచర్ల ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ నేత ఒంటెద్దు నర్సింహారెడ్డి తదితరులు

# ధాన్యం ధర ఢమాల్

### వారం క్రితం క్వింటాకు రూ.2,400 నుంచి రూ.2,500

### ఇప్పుడు సన్నాల్లో పచ్చగింజ సాకుగా చూపి అడ్డగోలుగా కోతలు



పాలకవీడు : వరి కోస్తున్న యంత్రం

- ధాన్యం ఎంత బాగున్నా రూ.2,200 నుంచి రూ.2,300లోపే..
- సిండికేట్ అయ్యి ధర తగ్గిస్తున్న మిల్లర్లు.. అధికారుల పర్యవేక్షణ కరువు
- సాగర్ ఆయకట్టులో వరి కోతలు ముమ్మరం..
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయని ప్రభుత్వం

ఈ యాసంగి సీజన్‌లో అనేక కష్టనష్టాలకు ఓర్చి సన్న రకం వరి సాగు చేసిన రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నష్టపోతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నాగార్జునసాగర్ ఆయకట్టు కింద 3.30లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అందులో అత్యధికంగా 2.25లక్షల ఎకరాల్లో వివిధ రకాల సన్నరకం హైబ్రిడ్ వంగడాలనే నాటు పెట్టారు. ఆయా వంగడాలు 90 నుంచి 100 రోజుల్లోనే చేతికి వచ్చేవి అవడంతో కోతలు కూడా మొదలయ్యాయి. సీజన్ ప్రారంభంలో వాతావరణ మార్పులతో వరి పెరగకుండానే పొట్ట దశకు వచ్చి ఈనడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు వ్యవసాయాధికారుల సూచనలతో సాధారణంగా యాసంగిలో రెండు సార్లు మాత్రమే యూరియా వేసే రైతులు ఈసారి మూడు నాలుగు సార్లు చల్లాల్సి వచ్చింది. ఇలాంటి ఆటుపోట్లను తట్టుకుని ఎకరాకు 35 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి తీస్తున్నా మార్కెట్లో రైతులకు సంతోషం లేకుండా పోతున్నది.

– మిర్యాలగూడ/పాలకవీడు, మార్చి 25

### వారం రోజుల్లో రూ.200కోత

ఐకేపీ కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320తోపాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్‌ను ఇస్తుంది. ఈ లెక్కన సన్నధాన్యం విక్రయించుకున్న రైతులకు క్వింటాకు రూ.2,820 దక్కుతుంది. కానీ, వరి కోతలు ఊపందుకున్నా ప్రభుత్వం ఇంకా సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దాంతో మిల్లర్లు డిందే ఆటగా మారింది. వారం రోజుల్లో రెండు రూపాయల ధర తగ్గించినా పట్టించుకునే వారు లేదని రైతులు వాపోతున్నారు.ఒకవైపు పెట్టుబడులు పెరిగి వ్యవసాయం భారంగా మారిందని, తీరా పంట చేతికి వచ్చా వ్యాపారులు దోచుకుంటున్నారని మదన పడుతున్నారు.



మిర్యాలగూడ : రైస్ మిల్లుల వద్ద ధాన్యం లోడ్లు

### పట్టించుకోని అధికారులు

మిర్యాలగూడలోని రైస్ మిల్లులకు నిత్యం వందల ట్రాక్టర్ల ధాన్యం వస్తున్నది. మిలర్లు పంట నాణ్యతకు తగిన ధర ఇవ్వకుండా ఇబ్బందుకు గురి చేస్తున్నా పౌర సరఫరాలు, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులెరూ స్పందించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదు చేద్దామని ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పచ్చ గింజ సాకుతో..

వరి కోతలు ఊపందుకున్నా ప్రభుత్వం ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దాంతో రైతులు నేరుగా ధాన్యం కోసి ట్రాక్టర్ బోరెంల్లో మిర్యాలగూడ రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఇక్కడి సిండికేట్ అయిన మిల్లర్లు ధర తగ్గిస్తూ రైతులను దోచుకుంటున్నారు. వారం క్రితం వరకూ మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లోని మిల్లుల్లో క్వింటాకు రూ.2,400 నుంచి రూ.2,500 వరకు ధర పెట్టి కొనుగోలు చేశారు. ఈ వారం కోతలు ముమ్మరం అవడంతో మిర్యాలగూడతోపాటు నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, నకిరేకల్, నల్లగొండ, సూర్యాపేట నియోజకవర్గాల నుంచి ధాన్యం లోడ్లు వస్తున్నాయి. ఇదే అదనుగా భావించిన మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి పచ్చి వడ్లు కావడంతో పచ్చగింజ కనపడుతుందని సాకుగా చూపి ధరను అమాంతం తగ్గించారు. ఇప్పుడు క్వింటాకు రూ.2,200 నుంచి రూ.2,300 వరకు ఇస్తున్నారు. ఆ రేటుకు అయితేనే కొంటాం.. లేదంటే మీ ఇష్టమని తేల్చి చెప్తుండడంతో ధాన్యం లోడ్‌తో వచ్చిన రైతులు వెనుదిరిగి వెళ్లక విధిలేని పరిస్థితుల్లో అమ్ముకుంటున్నారు.

### మిల్లర్ల సిండికేట్‌తో రైతులను దోపిడీ



ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు మిల్లుల వద్ద ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా మిల్లర్లు సిండికేట్ అయ్యి రైతులను దోచుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ అసలే ఉండడం లేదు. కొనుగోలు పూర్తయ్యే వరకు ప్రభుత్వం శ్రద్ధ పెట్టి రైతులకు న్యాయం చేయాలి. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తే మిల్లర్లు కూడా ధాన్యం రేటు పెంచే అవకాశం ఉంది.

-యరెడ్ల సత్యనారాయణరెడ్డి పీఏసీఎస్ చైర్మన్, పాలకవీడు

## కేసీఆర్ హయాంలో సర్వ మతాలకు ప్రాధాన్యం

- రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నేరేడుచర్ల, మార్చి 26 : మాజీ సీఎం కేసీఆర్ హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా సర్వ మతాలకు ప్రాధాన్యం ఇచ్చారని, పండుగలకు కానుకలు అందజేశారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని బుధవారం నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో గల మసీదులో ముస్లింలకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు జగదీశ్‌రెడ్డి తోపాటు మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చేసే కఠిన ఉపవాస దీక్షలు ఫలించాలని, అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని పండుగులను గౌరవించారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో నేరేడుచర్ల మున్సిపాలిటీలో మైనారిటీల సంక్షేమ కోసం రూ. 30లక్షలు మంజూరు చేశారని గుర్తు చేశారు. అనంతరం ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు అరిబండి సురేశ్‌బాబు, కిష్టపాటి అంజిరెడ్డి, కృష్ణానాయక్, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మాజీ ఎంపీపీలు చెన్నబోయిన సైదులు, లకుమళ్ల జ్యోతి భిక్షం, పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, హుజూర్‌నగర్ మాజీ జడ్పీటీసీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు కొప్పుల సైదిరెడ్డి, కడియం వెంకటరెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ గుర్రం మార్కండేయ, నాయకులు కుంకు చిన్నయ్య, ఇనపాల పిచ్చిరెడ్డి, మర్రు శ్రీను, రవీందర్, నాగరాజు, మైనార్టీ నాయకులు ఇబ్రహీం, ఖాదర్, షోయబ్, హుస్సేన్, ఖాజా, జానీ, బషీర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు ఇంతియాజ్ ఇంటికి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వెళ్లి పరామర్శించారు.



నల్లగొండ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## లీకేజీపై ప్రశ్నిస్తే కేటీఆర్‌పై అక్రమ కేసులు

- పది పేపర్ లీక్ చేసింది ఎమ్మెల్యే అనుచరులనేది అందరికీ తెలుసు
- పేపర్లు, టీవీల్లో వచ్చిన అంశాన్ని కేటీఆర్ ఎక్స్‌లో పెట్టడం తప్పా?
- కేసులతో భయపడేది లేదు.. ప్రజా క్షేత్రంలోనే తేల్చుతాం
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్లగొండ, మార్చి 26 : పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ అయిన విషయం పేపర్లతో పాటు టీవీల్లో రావడం వల్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వ వైఫల్యాన్ని ట్విట్టర్ వేదికగా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేపర్ లీక్ చేసే ధైర్యం నకిరేకల్‌లో ఎవరికీ లేదని, ఎమ్మెల్యే అండతోనే కాంగ్రెస్ పార్టీ నేతలు పేపర్‌ను లీక్ చేశారని అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యంతో చీకటి ఒప్పందం చేసుకొని ఆ దుశ్చర్యకు పాల్పడినట్లు ఆరోపించారు. పేపర్‌లో వచ్చిన దాన్ని ఒక పార్టీ అధినేతగా ప్రశ్నించటం కూడా తప్పేనా అని అన్నారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. ఎమ్మెల్యే వీరేశం తన అనుచరులైన నరేందర్, రజిత, ఉగ్గిడి శ్రీనివాస్‌లతో ఈ కేసులు ఉద్దేశపూర్వకంగానే పెట్టించారని, ఆయన ఆదేశం లేకుండా వారు ఇలాంటి కేసులు పెట్టరని చెప్పారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచిన దగ్గర నుంచి ఎన్నో అక్రమాలు, దందాలు, భూ కబ్జాలు చేయిస్తూ ఒక్కో కేసులో లక్షల్లో వసూలు చేసి డబ్బులు పోగేసుకుంటున్నట్లు విమర్శించారు. అడవిలో ఉన్న ఆయన్ను తీసుకొచ్చి కేసీఆర్ ఎమ్మెల్యేగా అవకాశమిస్తే, ఇవ్వాల తనకు భిక్ష పెట్టిన వాళ్లనే ఎదురించే స్థాయికి వచ్చారని, కేటీఆర్‌పైనే కేసులు పెట్టి కుట్ర చేస్తున్న ఆయన్ను ప్రజలు క్షమించబోరని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడం వల్లే బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని, కేసులకు భయపడకుండా న్యాయ వ్యవస్థతో పోరాడుతూ ప్రజాక్షేత్రంలో వారికి శిక్ష వేయిస్తామని తెలిపారు. నకిరేకల్‌లో కొందరు పోలీసులు, అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెడుతున్నారని, వారికి వడ్డీతో సహా చెల్లిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నల్లగొండ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి

- ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి
- సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా



సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సూర్యాపేట, మార్చి 26 : సాగు నీళ్లు లేక ఎండిన పంటలకు ఎకరానికి రూ. 30 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజక వర్గాల పరిధిలో ఎస్సారెస్పీ కాల్వకు నీళ్లు రాక పంటలు ఎండిపోయాయన్నారు. సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు 15 నెలలు అవుతున్న అమలు చేయలేదన్నారు. మహిళలకు చిత బస్సు సౌకర్యం తప్ప ఏ హామీ నెరవేర్చలేదని తెలిపారు. రుణమాఫీ చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా, అనేక మంది రైతులు రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బంధు సైతం రెండు ఎకరాలకు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. గృహలక్ష్మి, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రేషన్‌కార్డులు, ఆసరా పెన్షన్ల పెంపు ఇలా అనేక హామీలు అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలను వెంటనే అమలు చేయాలని, లేకుంటే ప్రజా క్షేత్రంలో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు సీపీఎం నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

ఈ కార్యక్రమలో సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, నాగారపు పాండు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, వెల్పుల వెంకన్న, దండ వెంకట్‌రెడ్డి, నరసింహారావు, శ్రీకాంత్, రవి, శంకర్ రెడ్డి, రజిత, జ్యోతి పాల్గొన్నారు.

## కొనపురి సాంబశివుడి ఆశయ సాధనకు కృషి

- 14వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన నాయకులు



భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్తూపం సాంబశివుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నాయకులు కంచర్ల రామకృష్ణారెడ్డి, దూదిమెట్ల బాలరాజుయాదవ్ తదితరులు

భువనగిరి అర్బన్/వలిగొండ, మార్చి 26 : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా నిరుపేదల పక్షాన కొనపురి సాంబశివుడు పోరాటం చేశారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. బీఆర్ఎస్ మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు కొనపురి సాంబశివుడి అలియాస్ కునపూరి అయిలయ్య 14వ వర్ధంతిని బుధవారం భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద, ఆయన స్వగ్రామం వలిగొండ మండలం దాసిరెడ్డి గూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివుడి చిత్ర పటానికి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్‌తోపాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబశివుడు చేసిన పోరాటాలను గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ భువనగిరి పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, బీఆర్ఎస్ వలిగొండ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి, నాయకులు పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, కొలుపుల అమరేందర్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాశ్‌గౌడ్, బీరు మల్లయ్య, అతికం లక్ష్మీనారాయణ, ర్యాకల శ్రీనివాస్, ఇట్టబోయిన గోపాల్, నక్కల చిరంజీవి, దిడ్డికాడి భగత్, తాడె రాజశేఖర్, పుట్ట వీరేశ్, బబ్లు, ఇస్మాయిల్, రహీం, సురేశ్, యాస సంతోష్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, పనుమటి మమతానరేందర్‌రెడ్డి, కొమిరెల్లి సంజీవరెడ్డి, కునపురి కవిత, డేగల పాండరి, కునపురి స్వర్ణలత, జానీ అఫ్రోజ్, నారి మల్లేశం, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



వెంకటేశ్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

అడ్డగూడూరు, మార్చి 26 : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. అడ్డగూడూరు మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన పర్రెపాటి వెంకటేశ్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో ఆయనకు బీఆర్ఎస్ క్రియాశీలక సభ్యత్వం ఉండడంతో బీమా మంజూరైంది. శాలిగౌరారంలో బుధవారం రూ.2లక్షల బీమా చెక్కును వెంకటేశ్ కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే కిశోర్ అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీలు పూలపల్లి జనార్దన్‌రెడ్డి, పాశం విష్ణువర్ధన్, నాయకులు చిత్తలూరి నరేశ్, బాలెంల అవినాశ్ ఉన్నారు.

## జై భవాని జ్యువెల్లర్స్ యజమానుల అరెస్టు

- చిట్యాల వద్ద పట్టుకున్న పోలీసులు
- కేజీ 185 గ్రాముల బంగారం స్వాధీనం



చిట్యాల వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్న యాదగిరి గుట్ట పట్టణ సీఐ రమేశ్, సిబ్బంది

యాదగిరిగుట్ట, మార్చి 26 : శుభకార్యాలకు బంగారం ఆభరణాలు చేయించేందుకు డబ్బులిచ్చిన వారిని, నగలు తాకట్టు పెట్టి నగదు తీసుకున్నవారిని, వడ్డీకి డబ్బులు తీసుకున్న వారిని బురిడీ కొట్టించి పారిపోయిన జై భవానీ జ్యువెల్లర్స్ యజమానులు జితేందర్‌లాల్, మధురాములును అదుపులోకి తీసుకున్నట్లు యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నల్లగొండ జిల్లా చిట్యాల సమీపంలో రెక్కీ నిర్వహించి నిందితులను అరెస్టు చేసినట్లు బుధవారం ఆయన మీడియాతో వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి కేజీ 185 గ్రాములు బంగారం, 64 కేజీల 620 గ్రాముల వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నామని, మరో కేజీ 946 గ్రాములు బంగారం సౌత్ ఇండియా బ్యాంకులో తనఖా పెట్టినట్లు గుర్తించామని తెలిపారు. నిందితుల వద్ద లభించిన బంగారం, వెండిని సీజ్ చేసి కోర్టులో డిపాజిట్ చేయనున్నట్లు చెప్పారు. కారును సీజ్ చేసి నిందితులు జితేందర్ లాల్, మధు రాములును రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన జితేందర్ లాల్ 15 ఏండ్ల క్రితం యాదగిరి గుట్ట పట్టణంలో అద్దె భవనంలో జై భవానీ జ్యువెల్లర్స్ షాపును ఏర్పాటు చేశాడు. చాలా ఏండ్లు గా గుట్టలో నమ్మకంగా ఉండటంతో పట్టణవాసులు జితేందర్ లాల్ వద్ద బంగారం తాకట్టు పెట్టారు. మరికొంత మంది వడ్డీకి పెద్ద మొత్తంలో డబ్బులిచ్చారు. ఇంకా కొంతమంది ఆభరణాలు చేసి ఇవ్వాలని రూ. లక్షల్లో నగదును అందజేశారు. ఈ క్రమంలో గత జనవరి నెలలో షాపును తీయకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు జితేందర్‌లాల్‌కు ఫోన్ చేయడంతో స్విచ్ఛాఫ్ వచ్చింది. భయాందోళనకు గురైన పట్టణవాసులు జనవరి 24న బంగారం షాపు వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో గత నెల 25న కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడికి సంబంధించిన షాపును సీజ్ చేసి మొబైల్ ఫోన్ల సిగ్నల్‌ను గుర్తించే పనిలో పడ్డారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు రాజస్థాన్‌లో ఓ నిందితుడి ఇంటికి సైతం వెళ్లారు. అదే సమయంలో నిందితుడి తండ్రి సైతం మృతి చెందడంతో పోలీసులు తిరుగు ప్రయాణమయ్యారు. తాజాగా నిందితులు బంగారు ఆభరణాలతో పట్టుబడటంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## అక్రమ కేసులతో ప్రభుత్వ వైఫల్యాల నుంచి తప్పించుకోలేరు

- ప్రశ్న పత్రాల లీకేజీపై ప్రశ్నించిన కేటీఆర్‌పై కేసులు పెట్టడమేంటి?
- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండ, మార్చి 26 : ప్రశ్న పత్రాల లీకేజీపై ప్రశ్నించిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం ప్రభుత్వం చేసిన అహంకారపూరితమైన చర్య అని, అక్రమ కేసులు పెట్టినంత మాత్రాన ప్రభుత్వ వైఫల్యాల నుంచి తప్పించుకోలేరని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. నల్లగొండలోని ఎంజీయూలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి ప్రశ్నా పత్రం పరీక్ష మొదలైన పది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్‌పై కేసులు పెట్టడమేంటని అన్నారు. అక్రమ కేసులతో ప్రశ్నించే గొంతులను నొక్కాలనే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని తెలిపారు. ప్రభుత్వం ప్రశ్నపత్రం లీకేజీపై విచారణ జరిపించాలని, లేదంటే సీబీఐకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే కేటీఆర్‌పై పెట్టిన కేసులు ఎత్తివేసి, నష్టపోయిన బాలికతో పరీక్ష రాయించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్వీ నేతలు నోముల క్రాంతి కుమార్, పాక రవి, మాచర్ల సుధీర్, విజయ్, వేముల సాయి, రమేశ్, ఉదయ్, నవీన్, శంకర్, సైదులు, రాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.